
# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 19, ఏప్రిల్ 2026



## చలివేంద్రమును సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**



వేసవికాలం నేపథ్యంలో పెరుగుతున్న ఎండల దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రమును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ బుర్స పోచయ్య పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక జూబ్లీ మార్కెట్ వద్ద రాజంపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి చలివేంద్రమును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి తాపాన్ని తట్టుకోవడానికి సామాన్యులకు, బాటసారులకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు జావీద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, పంచాయతీ సిబ్బంది సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించాలి






**ఆసిఫాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 20 నుండి 26 వరకు సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో 7 రోజులపాటు ప్రభుత్వం సంక్షేమ విద్యాలయాలు, వసతి గృహాలలో నిర్వహించనున్న సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 7 రోజులపాటు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల, ఆశ్రమ, షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో వంటగదులు, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ నిర్వహించాలని, వసతి గృహాలలో మైనర్ మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఉమ్మడిగా సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 7 రోజులపాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి నదీమ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డుప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

**తాండూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

మండలంలోని బోయపల్లి బోర్డు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాంబమూర్తి (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై ప్రసాదరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం... బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తికి చెందిన ఆటో డ్రైవర్ సాంబమూర్తి పని నిమిత్తం తాండూర్ వైపుకు వచ్చి ఇంటికి వెళ్తున్న నేపథ్యంలో బోయపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీ కొట్టిందన్నారు. సాంబమూర్తి అక్కడికక్కడే మృతి మృతి చెందారు. భాస్కరి శ్రీనివాస్ మరో ప్రయాణికునికి గాయాలయ్యాయి. అతనిని చికిత్స కోసం 108 అంబులెన్స్ బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

* ఆదిలాబాద్ శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ యోగానంద సరస్వతి...




**తాండూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

హిందూ ధర్మాన్ని, హైందవ సాంప్రదాయాన్ని కాపాడుకోవాలని ఆదిలాబాద్ శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం మఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ యోగానంద సరస్వతి అన్నారు. మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ లో శనివారం నిర్వహించిన హిందూ మహాసమ్మేళన కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై భక్తులకు అనుగ్రభాషణ చేశారు. రోజురోజుకు హిందూ సాంప్రదాయాలు, సంస్కృతిపై దాడులు పెరుగుతున్నాయన్నారు. హిందువులందరు చైతనవంతులై, ఐక్యంగా ఉండి హిందూ సమాజాన్ని, ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. పిల్లలకు తల్లి మొదటి గురువు అని అన్నారు. సకల దేవతలకు నిలయమైన గోమాత, స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుందో అక్కడ ఆ కుటుంబంలో సుఖసంతోషాలు విరిజిల్లుతాయన్నారు. పురుషులు మద్యం, మాంసం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మిగతా 2లో..



# హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

మొదటి పేజీ తరువాయి

మంచిర్యాల సహ ప్రాంత సద్భావన ప్రముఖ్ గోనె భూమయ్య మాట్లాడుతూ హిందువులు శక్తివంతులై హిందూ ధర్మాన్ని, సాంప్రదాయాలను, సంస్కృతిని పరిరక్షి ంచుకొని ప్రపంచంలోనే భారతదేశాన్ని విశ్వగురువు చాటాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా, లలిత సహస్ర నామ పారాయణం, కీర్తనలు, భగవద్గీత శ్లోకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అంతకుముందు మండల కేంద్రంలో హిందూ మహాసమ్మేళనం శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి హిందూ బంధువులు భారీగా తరలివచ్చారు. కిష్టంపేట హనుమాన్ మందిర్ నుంచి ఐబి చౌరస్తా గుండా సుమంగళి ఫంక్షన్ హాల్ వరకు హిందూ మహా సమ్మేళనం సమితి ఆధ్వర్యంలో హిందూ బంధువులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐబి చౌరస్తాలో నృత్యాలు చేశారు. జైశ్రీరామ్... జై హనుమాన్ నామస్మరణతో జాతీయ రహదారి మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో హిందూ మహాసమ్మేళనం సమితి మండల అధ్యక్షుడు మద్దికుంట రామచందర్, ప్రధాన కార్యదర్శి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన కమిటీ ఎన్నికలు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికలను ఎన్నికల అధికారి జనగామ తిరుపతి, పరిశీలకులు ఇస్లావత్ నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కుంచాల విజయ్, ప్రధాన కార్యదర్శిగా బర్ల కిరణ్ కుమార్, కోశాధికారిగా గోడిసెల రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా వెంకట్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా కందిమల్ల వెంకటేష్, పిఆర్వోగా సత్యనారాయణను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా పోతురాజుల మధుసుదన్, మలిశెట్టి మధుకర్, మొరేయ్ తిరుపతి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోశాధికారి పోతురాజుల రమేష్, జిల్లా శాశ్వత గౌరవ అధ్యక్షులు ఎనగంటి బిక్షపతి హాజరయ్యారు. అనంతరం ఎన్నికల అధికారులు నూతన అధ్యక్షుడు, కార్యదర్శి, ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, కార్యదర్శి మాట్లాడుతూ తమను ఎన్నుకున్న సహచర స్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప ధర్మ ప్రచార కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకువెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.




## హెల్మెట్ ధరించాలి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**... ఎస్సై అనిల్ కుమార్**



**పెంచికల్ పేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ఎస్పీ నిఖిత పంత్ ఆదేశాల మేరకు పెంచికల్ పేట్, కాఘజ్ నగర్ ప్రధాన రహదారిలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలనే సందేశలాతో ప్లకార్డులు పట్టుకుని వాహనదారులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో హెల్మెంట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఉట్నూర్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

**ఉట్నూర్, ఏప్రిల్ 18,ప్రభాత వార్త :**

మండలంలోని లక్కారం ఎన్టీఆర్ చౌక్ వద్ద బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు . శనివారం నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను కాంగ్రెస్, ఇండియా కూటమి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. దేశంలోని 72 కోట్ల మంది మహిళలను కాంగ్రెస్ మోసం చేస్తోందని మండిపడ్డారు. మహిళల ఆగ్రహానికి గురైన ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్ తేదీలో మార్పు

**సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ**

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 9వ తేదీన జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జూన్ 20వ తేదీకి మార్చడం జరిగిందని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 7వ తేదీ నుండి జూన్ 5వ తేదీ వరకు వేసవి సెలవుల నేపథ్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ తేదీని మార్పు చేయడం జరిగిందని తెలిపారు. కాక్షి దారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు

## ఈజ్‌గాం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ సేఫ్టీ అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో అరైవ్ అలైవ్ ప్రోగ్రాం" భాగంగా, జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే సందర్భంగా శనివారం రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, ఈజ్‌గాం ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహనదారులను గులాబీ పూలు అందజేసి అభినందించారు. అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్ సేఫ్టీ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమ ప్రాణాలను రక్షి ంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## జనగణనకు కెరమెరి సిద్ధం

**.... ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు విస్తృత శిక్షణ**



కెరమెరి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :

దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది అయిన జనగణన ప్రక్రియకు కెరమెరి మండలం సిద్ధమవుతోంది. సెన్సస్-2027లో భాగంగా ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శనివారం మండల కేంద్రంలో రూరల్ ఛార్జ్ లెవల్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల వివరాలు సేకరించే సిబ్బందికి ఈ శిక్షణ ఎంతో కీలకంగా మారింది. శిక్షణలో జనగణన నిర్వహణ విధానాలు, కుటుంబ సభ్యుల వివరాల నమోదు, గృహాల గుర్తింపు, డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఫారాల భర్తీ విధానం వంటి అంశాలపై అధికారులు వివరించారు. ప్రజల నుంచి సరైన సమాచారం సేకరించడమే జనగణన విజయానికి ప్రధానమని సూచించారు. ఈసారి శిక్షణను మూడు విడతలుగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొనగా, రెండో బ్యాచ్ శిక్షణను ఈ నెల 25న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఛార్జ్ ఆఫీసర్‌గా తహసీల్దార్ గోడం సంతోష్ కుమార్ పాల్గొని మార్గనిర్దేశం చేశారు. మాస్టర్ ట్రైనర్లు సోమయ్య, జే. గోవింద్ ప్రాక్టికల్ విధానాల్లో శిక్షణ ఇచ్చారు. మండల గిర్దావర్ పవన్ నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ సోము, రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. మండలంలో జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మైనర్ బాలలకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

**సారంగాపూర్,ఏప్రిల్18,,ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో ఆ రైవ్ అలైవ్ లో భాగంగా రోడ్డు భద్రత పై ఎస్సై శ్రీకాంత్ శనివారం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ పిల్లలకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. వారి తల్లితండ్రులను పిలిచి, మైనర్ పిల్లలకు నడపడానికి ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని,వారు ప్రమాదాలకి కారణమైతే ద్విచక్ర వాహన యజమానుల పైన కూడా కేసు నమోదు అవుతుంది అని హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్ సింగ్,ప్రణీత్ రెడ్డి, పాల్గొన్నారు.

## సీఎం ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీని మర్యాద పూర్వకంగా కలిసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

**నేరడిగొండ, ఏప్రిల్ 18,ప్రభాతవార్త;**



తెలంగాణ సచివాలయంలో సీఎం ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ శేషాద్రి ని మాజీ కేంద్ర మంత్రివర్యులు వేణుగోపాల్ చారితో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ మంజూరుకు సహకరించినందుకు శ్రీ శేషాద్రి కి ఆడే గజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల భద్రతకు ఫైర్ స్టేషన్ ఎంతో అవసరమని, ఈ నిర్ణయం బోథ్ ప్రాంతానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరిన్ని సదుపాయాలు తీసుకురావడానికి కృషి చేస్తామని ఆడే గజేందర్ వెల్లడించారు. ఆయన వెంట నాయకులు బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహా దాస్, నాయకులు అచ్యుతానంద రెడ్డి,బద్దం పోతారెడ్డి,యండి సద్దాం తదితరులు ఉన్నారు.

## నూతన ఎస్సైని సన్మానించిన బిజెపి నాయకులు

**బజార్ హత్నూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త;**



మండల కేంద్రంలోని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ గోకల రమేష్ ను బజార్ హత్నూర్ మండల బిజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మండల ప్రజలకు న్యాయం చేస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షి ంచారు.అలాగే ఆయన సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పొరెడ్డి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఏపీసీఎస్ఎస్ చైర్మన్, స్థానిక సర్పంచ్‌లు, బీజేపీ జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు

## నూతన ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త;**



మండల కేంద్రంలో ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జి. రమేష్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జల్కె పాండురంగ్, మాజీ నెట్‌క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమన్న తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఎస్సై జి. రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ చురుకైన పాత్ర పోషించాలని కోరారు. దీనికి స్పందించిన ఎస్సై జి. రమేష్, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తూ, ప్రజలతో సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన హామీ ఇచ్చారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:**

మండలలోని సాయినగర్ తండాకి చెందిన రాథోడ్ లక్ష్మణ్ (29) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత కొన్ని నెలల నుండి మద్యానికి బానిసయ్యడని. ఎటువంటి పని చేయకుండా ఆర్థికపరిస్థితిబాగాలేక మద్యానికి బానిసయ్యి తిరుగుతున్నాడన్నారు.శుక్రవారం ఇంట్లో భార్య లేని సమయంలో తాగిన మత్తులో ముందు పురుగుల మందు సేవించగా వెంటనే ఈ విషయాన్ని అక్కడే ఉన్న మృతుడి అన్న కూతురు గమనించి చుట్టు పక్కన వాళ్ళని పిలిచి 108 అంబులెన్సు ద్వారా నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుండి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయాడన్నారు.మృతుడి భార్య రాథోడ్ హీరాబాయి పిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు

# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడేషన్లు

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**



జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.అక్రిడేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ), కమిటీ సభ్యులపై ఉందన్నారు.అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆమె ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, కొండూరి రవీందర్, అల్లం అశోక్, ఆర్ మహేందర్, ఎం.ఏ. వసీం, రామెళ్ళ రాజేశ్వర్, సిరిపురం నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర లేబర్ కోడ్‌లపై కార్మికుల గర్జన

## కాసిపేటలో నల్లబ్యాడ్జీలతో నిరసన

**మందమర్రి, ఏప్రిల్18, ప్రభాతవార్త:**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాసిపేట గనిలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమానికి పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఏ.ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల అంజయ్య మాట్లాడుతూ, కార్మికుల సమస్యలకు పరిష్కారం ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలను అడ్డుకోవడంలో జాతీయ కార్మిక సంఘాలు విఫలమయ్యాయని విమర్శించారు.సింగరేణిలో కూడా కాంట్రాక్టు విధానం విస్తరిస్తున్న నేపథ్యంలో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు బ్లాక్‌ల వేలంపాటల విషయంలో జాతీయ సంఘాల నాయకులు తగిన విధంగా స్పందించలేదని, కార్మిక ప్రయోజనాల కంటే రాజీ విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడులు చేస్తోందని, ఈ పరిస్థితుల్లో బలమైన ఐక్య కార్మిక ఉద్యమం అవసరమని ఆయన పిలుపునిచ్చారు. కార్మిక వర్గ శ్రేయస్సు, సింగరేణి పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం చేపడుతున్న బొగ్గు గనుల వేలంపాటలను వ్యతిరేకిస్తూ, సింగరేణి పరిశీలించిన బొగ్గు బ్లాక్‌లను సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేయాలని కోరారు. కార్మిక సంఘాల మధ్య ఐక్యత అవసరమని, విభజన రాజకీయాలను తిప్పికొట్టాలని సూచించారు.ఈ నిరసన కార్యక్రమంలో సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, బెల్లంపల్లి ఏరియా నాయకులు ఎన్నం శంకర్, జిల్లాల మోహన్, ఏ.ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర నాయకులు ఎం. పోచమల్లు, టి.యు.సి.ఐ. రాష్ట్ర నాయకులు గోగర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ శ్రేణులు ఆందోళన కార్యక్రమం

**దండేపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త;**



దండేపల్లి మండల లో మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆరోపిస్తూ బీజేపీ శ్రేణులు శనివారం దండేపల్లి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు.మాజీ అధ్యక్షుడు రాజయ్య ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా,పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.